ఈనాడు కామారెడ్డి

మంగళవారం అక్టోబరు 22, 2024

12 గేట్లెత్తి..

శ్రీరామసాగర్ : శ్రీరామసాగర్ ప్రాజెక్టు నుంచి మిగులు జలాల విడుదల కొనసాగుతోందని ఏఈఈ కొత్త రవి తెలిపారు. సోమవారం మధ్యాహ్నం వరద చేరిక 51,942 క్యూసెక్కులు ఉండగా.. 12 గేట్ల ద్వారా 37,488 క్యూసెక్కులను దిగువకు వదులుతున్నట్లు చెప్పారు. ప్రాజెక్టులో పూర్తిస్థాయి నీటి మట్టం ఉందన్నారు.

అమరుల స్ఫూర్తితో పనిచేయాలి

కామారెడ్డి నేరవిభాగం, న్యూస్‌టుడే: పోలీసులు అమరుల త్యాగాల స్ఫూర్తితో పనిచేయాలని పాలనాధికారి ఆశిష్ సాంగ్వాన్ పేర్కొన్నారు. పోలీసు అమరవీరుల సంస్మరణోత్సవాల్లో భాగంగా జిల్లా పోలీసు కార్యాలయం ఆవరణలోని అమరవీరుల స్తూపం వద్ద ఎస్పీ సింధుశర్మ, అమరుల కుటుంబ సభ్యులతో కలిసి సోమవారం నివాళులర్పించారు. శాంతి భద్రతల పరిరక్షణలో పోలీసు వ్యవస్థ కీలకమన్నారు. అమరుల త్యాగాలను స్మరించుకోవాల్సిన బాధ్యత అన్ని వర్గాల ప్రజలపై ఉందని ఎస్పీ సింధుశర్మ పేర్కొన్నారు. విధి నిర్వహణలో ఏడుగురు పోలీసులు తమ ప్రాణాలు కోల్పోయారని గుర్తుచేశారు. వారి కుటుంబాలకు అండగా ఉండడమే మనం అందించే నిజమైన నివాళి అన్నారు. అనంతరం అమరుల కుటుంబాలకు 300 గజాల స్థలాలకు సంబంధించిన ధ్రువపత్రాలను అందజేశారు. పోలీసు శాఖ నేతృత్వంలో రెడ్‌క్రాస్ సొసైటీ సహకారంతో మెగా రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఎస్పీ సింధుశర్మతో పాటు పలువురు పోలీసులు, ఇతరులు రక్తదానం చేశారు. కార్యక్రమంలో ఏఎస్పీ నర్సింహారెడ్డి, కామారెడ్డి, ఎల్లారెడ్డి డీఎస్పీలు నాగేశ్వర రావు, శ్రీనివాసులు, సీఐలు, ఎస్సైలు, రెడ్‌క్రాస్ సొసైటీ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



స్తూపం వద్ద నివాళులర్పిస్తున్న పాలనాధికారి ఆశిష్ సాంగ్వాన్, ఎస్పీ సింధుశర్మ, పోలీసు అమరుల కుటుంబ సభ్యులు తదితరులు

అనుమతులిస్తే ఆపదే...

- ఇసుక రీచ్‌లు తెరిచేందుకు సాధ్యాసాధ్యాలపై నివేదిక కోరిన టీజీఎండీసీ

ఈనాడు, కామారెడ్డి

మంజీర నదిలోని ఇసుక తోడి విక్రయించేందుకు తెలంగాణ రాష్ట్ర ఖనిజాభివృద్ధి సంస్థ(టీజీఎండీసీ) కసరత్తు చేస్తోంది. అభివృద్ధి కార్యక్రమాలు, ప్రైవేటు నిర్మాణ పనుల అవసరాలకు జిల్లా పరిధిలోని పది ప్రాంతాల్లో క్వారీలు ప్రారంభించేందుకు యంత్రాంగం గనుల శాఖను నివేదిక కోరింది. రాజకీయ ఒత్తిళ్లతో క్వారీలకు అనుమతులు మంజూరు చేస్తే పరివాహక ప్రాంతంలో భూగర్భ జలాలు అడుగంటిపోయే ప్రమాదం ఉందని అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు.



మంజీరలో ఇసుక తవ్వకాలు (పాత చిత్రం)

చెక్‌డ్యాంల నిర్మాణం పేరుతో..

★ గత ప్రభుత్వం మంజీరపై చెక్‌డ్యాంల నిర్మాణం చేయాలనే లక్ష్యంతో ఇసుక తవ్వకాలకు అనుమతులు మంజూరు చేసింది. బిచ్కుంద-బీర్కూర్ మండలాల పరిధిలోని ఖద్గాం-శెట్లూర్ పరీవాహక ప్రాంతంలో ఆరు రీచ్‌ల్లో 30 లక్షల క్యూబిక్ మీటర్ల ఇసుకను తోడేందుకు డీఎల్ఎస్‌సీ(డిస్ట్రిక్ లెవల్ సాండ్ కమిటీ) అనుమతులు మంజూరు చేయగా.. ఇసుకాసురులు అధికారులను మచ్చిక చేసుకొని 50 నుంచి 60 లక్షల క్యూబిక్ మీటర్లు తవ్వి తరలించారు. రికార్డుల్లో మాత్రం 13 లక్షల క్యూబిక్ మీటర్ల ఇసుకను మాత్రమే తరలించినట్లు నమోదు చేశారు.

★ కాంగ్రెస్ సర్కారు అధికారంలోకి వచ్చాక స్థానికుల ఫిర్యాదు మేరకు గనుల శాఖ ఆధ్వర్యంలోని కమిటీ క్షేత్రస్థాయి విచారణ నిర్వహించి నిర్దేశిత లక్ష్యం కంటే అధికంగా తవ్వినట్లు నిర్ధారించింది. తదనంతరం మారిన రాజకీయ పరిణామాలతో తిరిగి జిల్లా యంత్రాంగం ఇసుక రీచ్‌ల్లో తవ్వకాలకు అనుమతులు మంజూరు చేసింది. ఈ క్రమంలో స్థానికులు, ఆయకట్టు రైతులు అక్రమ తవ్వకాలపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా ప్రయోజనం లేకుండా పోయింది. చివరకు హైకోర్టు ఉత్తర్వులతో తవ్వకాలను నిలిపివేశారు.

భూగర్భ జలాలు అడుగంటిపోతున్నాయని..


జిల్లాతో పాటు సమీప ప్రాంతాల్లో ఇసుక కొరతతో నిర్మాణాలకు ఇబ్బందులు తలెత్తుతున్నాయనే సాకుతో మంజీరలో రీచ్‌లకు అనుమతులు మంజూరు చేయించడానికి కొంతమంది అక్రమార్కులు ప్రయత్నాలు ప్రారంభించారు. అసంపూర్తి చెక్‌డ్యాంల నిర్మాణాలు పూర్తిచేయడం, పట్టా భూముల్లో పేరుకుపోయిన ఇసుక మేటలు తొలగించేందుకే అనుమతులు మంజూరు చేయాలని రాజకీయ నేతల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. కేంద్ర ప్రభుత్వ సంస్థ మంజీరలో ఇసుక తవ్వకాలతో భూగర్భజలాలు అడుగంటిపోతున్నాయని తన నివేదికలో వెల్లడించింది. ఇదేవిధంగా తవ్వకాలు కొనసాగితే భవిష్యత్తులో పరీవాహక ప్రాంతంలోని బోరుబావులు వట్టిపోయే ప్రమాదం ఉందని నీటిపారుదల శాఖ, భూగర్భ జలవనరుల శాఖతో పాటు జిల్లా యంత్రాంగాన్ని తన నివేదికతో అప్రమత్తం చేసింది. త్వరలో తుది నివేదికను సిద్ధం చేసి రాష్ట్ర ప్రభుత్వానికి సమర్పించనున్నామని సర్వే అధికారులు పేర్కొన్నారు. టీజీఎండీసీ అధికారులు ఇసుక తవ్వకాలకు అనువైన పరిస్థితులున్నాయా లేవా అనే దానిపై నివేదిక కోరారని గనుల శాఖ అధికారి నగేష్ పేర్కొన్నారు. కలెక్టర్ ఆధ్వర్యంలోని డిస్ట్రిక్ లెవల్ సాండ్ కమిటీలోని అధికారులు క్షేత్రస్థాయిలో సర్వే నిర్వహించిన తర్వాతే అనుమతుల ప్రక్రియ ప్రారంభమవుతుందన్నారు. ప్రస్తుతం మంజీరలో వరద ప్రవాహం ఉన్న నేపథ్యంలో ఇసుక తవ్వకాలకు అనువైన పరిస్థితులు లేవన్నారు.

స్వచ్ఛ సర్వేక్షణ్‌పై దృష్టి


మెరుగైన ర్యాంకు సాధనకు పురపాలికల్లో కసరత్తు

న్యూస్‌టుడే, కామారెడ్డి పట్టణం

జిల్లాలోని పురపాలికల్లో స్వచ్ఛ సర్వేక్షణ్‌పై యంత్రాంగం దృష్టి పెట్టింది. ఈ సారి మెరుగైన ర్యాంకులు సాధించేలా క్షేత్రస్థాయిలో అవగాహన కార్యక్రమాలు చేపట్టనున్నారు. తడి, పొడి చెత్తను వేర్వేరు డబ్బాల్లో వేసి ఇవ్వాలని ప్రజలకు సూచించనున్నారు. పురపాలికల్లో 30 నుంచి 38 శాతమే ఇలా ఇస్తున్నారు. దీంతో పరిస్థితి గాడి తప్పుతోంది. తద్వారా ఉత్తమ ర్యాంకులు సాధనలో వెనకబడిపోతున్నారు. ఈ సంవత్సరం అలాంటి విధానానికి భిన్నంగా అధికారులు చర్యలు చేపడుతున్నారు.



కామారెడ్డిలో తడి, పొడి చెత్తపై అవగాహన కల్పిస్తున్న పుర ఛైర్‌పర్సన్ ఇందుప్రియ



మార్పు రావాలనే ఉద్దేశంతో..

స్వచ్ఛతపై వినియోగించే పురపాలిక వాహనాలు ఇళ్ల వద్దకు వచ్చినప్పుడు పారిశుద్ధ్య సిబ్బంది ఒకే డబ్బాలో చెత్త ఇవ్వకుండా అవగాహన కల్పించనున్నారు. వార్డుల వారీగా చైతన్య కార్యక్రమాలు నిర్వహించనున్నారు. తడి, పొడి చెత్తను ఎలా వేరు చేయాలో ప్రత్యక్షంగా చూపించనున్నారు. భూమిలో కలిసిపోయే కూరగాయలు, ఇతర వ్యర్థాలు, కుళ్లిన పండ్లు, ఇంట్లో మిగిలిన ఆహార పదార్థాలను ఒక డబ్బాలో వేయాలని సూచించనున్నారు. ప్లాస్టిక్ డబ్బాలు, సీసాలు, ఇనుప ముక్కలు, కాగితాలు, అట్టలు, ఇతర పొడి వ్యర్థాలను మరో డబ్బాలో వేయాలని నిర్దేశించనున్నారు.

ప్రధాన ప్రాంతాల్లో ప్రచార ప్రతులు

పురపాలికల్లోని ప్రధాన రోడ్ల వెంబడి హోర్డింగ్‌లను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఇంటింటి ఉత్పత్తి అయిన చెత్తాచెదారాన్ని రోడ్లపై, ఖాళీ స్థలాల్లో పారేయకుండా అవగాహన కల్పిస్తారు. పరిసరాల శుభ్రతపై బడుల్లో కార్యక్రమాలు నిర్వహించనున్నారు. జిల్లా కేంద్రంలోని ప్రజలను చైతన్యం చేసేందుకు వివిధ రకాల కార్యక్రమాలు చేపడతామని కామారెడ్డి శానిటరీ ఇన్‌స్పెక్టర్ పర్వేజ్ తెలిపారు. ఈసారి మెరుగైన స్వచ్ఛ ర్యాంకింగ్ కోసం ప్రయత్నిస్తామన్నారు.

పరిశోధన, బోధన రంగాల బలోపేతం

- ఇంజినీరింగ్ కళాశాల, న్యాక్, స్నాతకోత్సవంపై దృష్టి
- తెవివి వీసీగా బాధ్యతలు చేపట్టిన ఆచార్య టి.యాదగిరిరావు

న్యూస్‌టుడే, తెవివి క్యాంపస్

తెలంగాణ విశ్వవిద్యాలయం నూతన వీసీగా ఆచార్య టి.యాదగిరిరావు సోమవారం బాధ్యతలు చేపట్టారు. అనంతరం ఆయన విలేకర్లతో మాట్లాడారు.. అభివృద్ధి, ప్రధాన అంశాల్లో ఇంజినీరింగ్ కళాశాల ఏర్పాటు, మెరుగైన న్యాక్ గ్రేడు, త్వరలోనే స్నాతకోత్సవం నిర్వహణ.. ఈ మూడింటిపై దృష్టి సారించి శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని పేర్కొన్నారు. వర్సిటీ సమస్యలపై 'ఈనాడు'లో వచ్చిన 'దశ తిరగాలి.. తెవివి మురవాలి' కథనంపై ప్రధానంగా చర్చించారు. '18 ఏళ్ల వర్సిటీ చరిత్రలో ఒక్కసారే స్నాతకోత్సవం జరపడం సరికాదు. యూజీసీ నిబంధనల ప్రకారం ప్రతి ఆరు నెలలకోసారి స్నాతకోత్సవం జరపాలి. సాధ్యమైనంతలో ఏడాదికోసారైనా నిర్వహించాలి. సత్వరం స్నాతకోత్సవం నిర్వహించేలా చూస్తా. మెరుగైన న్యాక్ గుర్తింపు కోసం సెల్ఫ్ స్టడీ రిపోర్టును సమర్పించి వసతులు సమకూరుస్తాం. నిజామాబాద్ జిల్లాలో ప్రభుత్వ ఇంజినీరింగ్ కళాశాల లేకపోవడం బాధాకరం. కాకతీయ వర్సిటీలో ఇంజినీరింగ్ కోర్సుల ఏర్పాటుకు నేను కృషి చేశా. తెవివిలో ఇంజినీరింగ్ కళాశాల ఏర్పాటు ఆవశ్యకతపై ప్రభుత్వానికి నివేదిక పంపిస్తాం. సమస్యల పరిష్కారంలో ప్రజాప్రతినిధుల సహకారం ఆశిస్తాం. మెదక్, నిర్మల్, ఆదిలాబాద్ జిల్లాలు తెవివి అఫిలియేషన్ పరిధిలోకి వచ్చేలా ప్రభుత్వానికి మళ్లీ నివేదిస్తాం. కొత్తగా ఫార్మసీ సైన్స్ కోర్సులు, సెల్ఫ్ ఫైనాన్స్ కోర్సులు ప్రవేశపెట్టాలనే ఆలోచన ఉంది' అని వీసీ పేర్కొన్నారు. వర్సిటీ భూముల వివరాలు, సమస్యలపై రిజిస్ట్రార్ యాదగిరిని ఆరా తీశారు. 570 ఎకరాల భూమి ఉండగా, ఇందులో కొంత భూమి వివాదంలో కోర్టు కేసు నడుస్తోందని, ఇటీవలే జిల్లా కలెక్టర్‌కు రాతపూర్వకంగా లేఖ పంపినట్లు రిజిస్ట్రార్ బదులిచ్చారు. మరో మహిళా హాస్టల్ నిర్మాణం కోసం రూసా నిధులు న్యాయని టెండర్లు చేపట్టాల్సి ఉందన్నారు. సైన్స్ కళాశాల తుది దశలో ఉందని వివరించారు. వర్సిటీలో సెనెట్ కమిటీ లేదనే విషయాన్ని వీసీ గ్రహించారు. అనంతరం వర్సిటీలోని కళాశాలలు, హాస్టళ్లు, గ్రంథాలయం తనిఖీ చేసి ఉద్యోగులు, విద్యార్థులతో మాట్లాడారు. అంతకు ముందు వీసీకి ఉద్యోగులు, సిబ్బంది, విద్యార్థి నాయకులు, పలు విద్యా సంస్థల ప్రతినిధులు పుష్పగుచ్ఛాలు ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు.



ఉద్యోగులు, సిబ్బందితో సమావేశంలో వీసీ ఆచార్య టి.యాదగిరిరావు

ఓటరు నమోదుపై దృష్టి పెట్టాలి

కామారెడ్డి కలెక్టరేట్ : ఓటరు నమోదుపై యంత్రాంగం దృష్టి పెట్టాలని రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్‌రెడ్డి అధికారులకు సూచించారు. సోమవారం హైదరాబాద్ నుంచి పాలనాధికారి ఆశిష్ సాంగ్వాన్, ఇతర అధికారులతో వీసీ ద్వారా సమీక్షించారు. ఎమ్మెల్సీ ఎన్నికలకు నవంబరు 6వ తేదీలోపు ఓటరు జాబితాను పూర్తి చేయాలన్నారు.

రుణ లక్ష్యం.. 75 శాతం

న్యూస్‌టుడే, బాన్సువాడ పట్టణం

మహిళల ఆర్థికాభివృద్ధికి దోహదం చేస్తూ.. వారి ఉన్నతే లక్ష్యంగా ముందుకు సాగేందుకు స్వయం సహాయ సంఘాలు దోహదపడతాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం 2024-25కు జిల్లాలోని పురపాలికల్లో స్వయం సహాయక సంఘాలకు ఇచ్చే రుణాల లక్ష్యం ఆరు నెలల్లోనే 75 శాతం పూర్తయింది. 2024-25 సంవత్సరానికి రూ.48కోట్ల బ్యాంకు లింకేజీ రుణ లక్ష్యం కాగా.. రూ.36 కోట్లు పంపిణీ చేశారు. రుణాల తిరిగి చెల్లింపుల్లో సైతం లక్ష్యాన్ని సాధించేందుకు కృషి చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. తొలుత లక్ష్యం రూ.40 కోట్లే ఉండగా 90శాతానికి చేరుకోవడంతో మరో రూ.8కోట్లు ఇచ్చేలా లక్ష్యం పెంచారు.



ఆర్పీలు, సహాయ సంఘాల సభ్యులతో రుణాలపై సమీక్షిస్తున్న మెప్మా పీడీ శ్రీధర్‌రెడ్డి

ప్రత్యేక ప్రణాళికతో..

మెప్మా అధికారులు, ఆర్పీలు పురపాలికకు సంబంధించిన రుణ లక్ష్యాలను వార్డుల వారీగా విభజించి ప్రత్యేక ప్రణాళికతో ప్రతి వారం సిబ్బంది, బ్యాంకు అధికారులతో సమీక్షలు నిర్వహించారు. సంఘాలకు రుణాలు అందించేందుకు ఆర్పీలు వారి ఏఎల్ఎఫ్‌ల వారీగా మహిళలను ప్రోత్సహిస్తూ.. వారికి ఆసక్తి ఉన్న రంగాలపై అవగాహన కల్పిస్తూ.. లక్ష్యం దిశగా ముందుకు సాగారు.

డిసెంబరు వరకు పూర్తి చేస్తాం..

పాలనాధికారి ప్రత్యేక చొరవతో ఈ లక్ష్యం సాధ్యమైంది. ఆర్పీలు, బ్యాంకు అధికారులు సైతం ఎంతో కృషి చేశారు. బ్యాంకులు, సంఘాలు, నెలవారీగా ప్రణాళికలు రూపొందించుకొని క్షేత్రస్థాయిలో అమలుపరచడంతో లక్ష్య సాధన దిశగా కదులుతున్నాం. డిసెంబరు వరకు శతశాతం పూర్తి చేస్తాం. రుణాలు తిరిగి చెల్లించిన వారికి రెట్టింపు రుణాలు మంజూరు చేసేలా చర్యలు చేపడుతున్నాం. **- శ్రీధర్‌రెడ్డి, మెప్మా పీడీ**

వసతి గృహాలకు శంకుస్థాపన

నిజామాబాద్ న్యాయవిభాగం, బోధన్ గ్రామీణం న్యూస్‌టుడే: నిజామాబాద్‌లో 6, బోధన్‌లో 2 న్యాయమూర్తుల వసతి గృహాలకు హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ కె.సురేందర్, జస్టిస్ అలిశెట్టి లక్ష్మీనారాయణ, జస్టిస్ వినోద్ కుమార్ వర్చువల్ విధానంలో సోమవారం శంకుస్థాపన చేశారు. అనంతరం జిల్లాజడ్జి కుంచాల సునీత న్యాయమూర్తుల వసతి సముదాయంలో భూమిపూజ చేశారు.



వరి కోతలు షురూ..

ఈ వానాకాలం సీజన్‌లో జిల్లా రైతులు 3.15 లక్షల ఎకరాల్లో వరి సాగు చేశారు. అన్నదాతలు ఓ వైపు వరి కోతలు ప్రారంభించగా.. మరోవైపు బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండంతో జిల్లాలో నిత్యం ఏదో ఓ చోట పెద్దఎత్తున వర్షం కురుస్తుండడం వారిని కలవర పెడుతోంది. వరణుడు కనికరిస్తేనే తాము ఆరుగాలం కష్టించి పండించిన పంట ఇళ్లు చేరతాయని పేర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో చైన్లతో నడిచే యంత్రాలకు డిమాండ్ పెరిగి కోత ఖర్చులు అధికమయ్యే అవకాశాలున్నాయని వాపోతున్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలను త్వరగా ఆరంభించి కొనుగోళ్లను వేగవంతం చేయాలని కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, కామారెడ్డి వ్యవసాయం**

సమస్యల పరిష్కారానికి సహాయ కేంద్రం

కామారెడ్డి కలెక్టరేట్, న్యూస్‌టుడే: ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ఏవైనా సమస్యలుంటే రైతులు 08468-220051 నెంబరులో సంప్రదించాలని కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ సూచించారు. కలెక్టరేట్‌లో సోమవారం సహాయ కేంద్రాన్ని ప్రారంభించి మాట్లాడారు. రైతుల సౌకర్యార్థం సహాయ కేంద్రాన్ని ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. ఫిర్యాదు చేస్తే సంబంధిత అధికారులను పంపి పరిష్కరించడానికి కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో పౌర సరఫరాల శాఖ డీఎం రాజేందర్, డీఎస్‌వో నర్సింహారావు, డీసీవో రామ్మోహన్, మార్కెటింగ్ అధికారిణి రమ్య తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు : మంత్రి

నిజామాబాద్ అర్బన్, న్యూస్‌టుడే: అర్హులకు సంక్షేమ పథకాలు అందేలా చూడాలని ఉమ్మడి జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు పేర్కొన్నారు. నిజామాబాద్ రాజీవ్‌గాంధీ ఆడిటోరియంలో సోమవారం నిర్వహించిన కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ, అనంతరం నుడా (నిజామాబాద్ అర్బన్ డెవలప్‌మెంటు అథారిటీ) కార్యాలయంలో ఛైర్మన్‌గా కేశవేణు బాధ్యతల స్వీకరణ కార్యక్రమాలకు హాజరై మాట్లాడారు. చెక్కుల పంపిణీలో జాప్యం ఉండొద్దన్నారు. ఒకవేళ దరఖాస్తు తిరస్కరిస్తే ఆ కారణం లబ్ధిదారుడికి తెలియజేయాలన్నారు. జిల్లాకు ఇంజినీరింగ్, ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల, 20, 21 ప్యాకేజీ పనుల పూర్తికి తనవంతు చొరవ చూపుతానని హామీ ఇచ్చారు. కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలకు బడ్జెట్ పెంచాలని ప్రభుత్వం ఆలోచిస్తోందని ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ తెలిపారు. జిల్లా అభివృద్ధికి పార్టీలకతీతంగా పని చేయాలని పీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేశ్ కుమార్ గౌడ్ సూచించారు. అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్, కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు, రాష్ట్ర ఖనిజాభివృద్ధి సంస్థ ఛైర్మన్ ఈరవత్రి అనిల్, రాష్ట్ర సహకార సంఘాల ఛైర్మన్ మానాల మోహన్‌రెడ్డి, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, కార్పొరేటర్లు పాల్గొన్నారు.



కేశ వేణును కుర్చీలో కూర్చోబెడుతున్న మంత్రి జూపల్లి కృష్ణారావు, చిత్రంలో పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్‌గౌడ్, షబ్బీర్ అలీ, సుదర్శన్‌రెడ్డి, మధుయాస్కీ తదితరులు

ఉద్రిక్తంగా మారిన ధర్నా

కలెక్టరేట్ సమావేశ గది ఎదుట విద్యార్థుల తల్లిదండ్రుల బైఠాయింపు

కామారెడ్డి కలెక్టరేట్, న్యూస్‌టుడే: వసతిగృహంలోని సమస్యలు పరిష్కరించాలంటూ బీబీపేట జ్యోతిబా పులే గురుకులం తల్లిదండ్రుల కమిటీ ప్రతినిధులు చేపట్టిన ధర్నా ఉద్రిక్తంగా మారింది. కమిటీ ప్రతినిధులు సోమవారం విద్యార్థులతో కలిసి కలెక్టరేట్ ప్రధాన గేటు ఎదుట బైఠాయించి నిరసన తెలిపారు. ప్రభుత్వం, అధికారులకు వ్యతిరేకంగా నినాదాలు చేయగా.. పోలీసులు అక్కడికి చేరుకొని వారిని శాంతింపజేయడానికి యత్నించారు. ఇంతలో కొందరు మహిళలు కలెక్టరేట్‌లోకి వెళ్లి ప్రజావాణి నిర్వహించే సమావేశ మందిరం ఎదుట బైఠాయించారు. అడ్డుకున్న పోలీసులతో వాగ్వాదానికి దిగారు. నాలుగు వారాల నుంచి వినతులు ఇచ్చి ధర్నాలు చేపట్టినా అధికారుల్లో చలనం లేదంటూ మండిపడ్డారు. పాఠశాల సొంత భవనానికి వెంటనే నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అరకొర వసతులతో విద్యార్థులు అవస్థలు పడుతున్నా పట్టించుకోవడం లేదని వాపోయారు. దీంతో కలెక్టర్‌తో మాట్లాడే అవకాశం కల్పిస్తామని పోలీసులు మహిళలకు నచ్చజెప్పడంతో శాంతించారు.



కలెక్టరేట్‌లో పోలీసులతో వాగ్వాదానికి దిగిన మహిళలు

వరిలో తెగుళ్లు.. నివారణ చర్యలు

కోటగిరి, న్యూస్‌టుడే: ఆలస్యంగా వరి నాట్లు వేసుకున్న ప్రాంతాల్లో పూత దశ నుంచి గింజ పాలు పోసుకునే దశలో ఉన్నాయి. ఆలస్యంగా వేసుకున్న పంటలపై తెగుళ్లు, సుడిదోమ ఉద్ధృతి తీవ్రంగా ఉంది. తెగుళ్లు, సుడి దోమ నివారణకు తీసుకోవాల్సిన చర్యల గురించి రుద్రూర్ వరి, చెరకు పరిశోధన కేంద్రం అధిపతి డా.బాలాజీనాయక్ వివరించారు.



సుడి దోమ లక్షణాలు: ఈ పురుగులు మొక్క మొదళ్లలో నివాసం ఏర్పరచుకుని రసాన్ని పీలుస్తుండటంతో ఆకులు నారింజ, పసుపు రంగుకి మారి ఆ తర్వాత గోధుమ రంగులోకి మారుతాయి. క్రమేపీ పైరు సుడులు సుడులుగా ఎండిపోయి మొక్క చనిపోతుంది.

యాజమాన్యం: పిల్ల, పెద్ద పురుగులు కలిసి మొక్క దుబ్బుకు 20-25 దోమలు ఉన్న దశలో డైనోఫ్యూరాన్ 0.4గ్రా. లేదా పైమెట్రజైన్ 0.6గ్రా. లేదా ట్రైఫ్లుమెజోపైరిమ్ 0.47మి.లీ లేదా ఎథిప్రోల్, ఇమిడాక్లోప్రిడ్ 0.25గ్రా. లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలి.

రైతేరాజు

కాటుక, మెడవిరుపు తెగులు లక్షణాలు: కాటుక తెగులు పూత దశలో ఆశిస్తుంది. అధికవర్షాలతో శిలీంధ్రం పెరగడంతో గింజ ఆకుపచ్చ ముద్దగా తయారై పసుపు రంగులోకి మారి చివరకు నల్లబడుతుంది. మెడవిరుపు తెగులు గింజ గట్టిపడే దశలో ఆశిస్తుంది. ఈనిక దశలో మెడపైన నల్లని మచ్చలు ఏర్పడి కంకులకు పోషకాలు అందకపోవడంతో మెడలు విరిగి కంకులు వేలాడుతుంటాయి. తద్వారా గింజలు తాలు పోతాయి.

యాజమాన్యం: ఈనిక దశలో ఉన్న వరి పంటలో ఈ రెండు తెగుళ్లు సోకే ఆస్కారం ఉంది. నివారణకు టెబ్యుకొనజోల్, ట్రైఫ్లాక్సిస్ట్రోబిన్ 80గ్రా. లేదా ప్రొపికొనజోల్ 200 మి. లీ లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలి. మెడవిరుపు తెగులు లక్షణాలను గింజ పాలు పోసుకునే దశలో గమనిస్తే ఐసోప్రోథయోలిన్ 320మి. లీ లేదా అజిక్సోస్ట్రోబిన్, ట్రైసైక్లోజోల్ 200 మి. లీ ఎకరాకు పిచికారీ చేయాలి.

కూరగాయలు.. ఆదాయ మార్గాలు

న్యూస్‌టుడే, పోతంగల్

కూరగాయల సాగులో లాభాలు గడిస్తున్నారు పోతంగల్‌కు చెందిన రైతు సూదం విఠల్. మంజీర పరివాహక ప్రాంతంలో 5ఎకరాలు కౌలుకు తీసుకుని చిక్కుడు, గోబీ, బీర, కాకర పంటలు పండిస్తున్నారు. 70 రోజుల్లో చేతికొచ్చే పంటలు ఎంపిక చేసుకుని ఆదాయం పొందుతున్నారు.



చిక్కుడులో అంతర పంటగా గోబీ

తీగ చిక్కుడు, గోబీ: 30 గుంటల విస్తీర్ణంలో తీగ చిక్కుడు సాగు చేశారు. అంతర పంటగా గోబీ వేశారు. రూ.50 వేలు ఖర్చు చేసి జులైలో చిక్కుడు విత్తుకోగా సెప్టెంబరు నుంచి దిగుబడి ప్రారంభమైంది. ప్రస్తుతం 2.5 క్వింటాళ్ల చిక్కుడును మార్కెట్‌లో విక్రయించగా రూ.13 వేలు లాభం వచ్చింది. పంట పూర్తయ్యే వరకు రూ.1.5లక్షల ఆదాయం రావచ్చని అంచనా. జులైలో గోబీ నాటగా అక్టోబరు మొదటి వారంలో కోత పూర్తయింది. రూ.1.6 లక్షల ఆదాయం వచ్చింది. పెట్టుబడి రూ.75 వేలు పోను రూ.85 వేల లాభం సమకూరింది.

బీర: ఒక ఎకరంలో బీర సాగు చేపట్టారు. జూన్‌లో పంట విత్తుకోగా సెప్టెంబరు నుంచి కోత ప్రారంభమైంది. నేటి వరకు 40 క్వింటాళ్ల బీర కాయలను మార్కెట్‌లో విక్రయించగా రూ.1.6 లక్షల ఆదాయం సమకూరింది. పంట చివరి దశలో ఉన్నందున మరో సుమారు రూ.30 వేలు రావొచ్చని అంచనా. పెట్టుబడి రూ.లక్ష పోను రూ.90 వేలు ఆదాయం వచ్చింది.

కాకర: 20 గుంటల్లో కాకర సాగు చేశారు. జూన్‌లో పంట విత్తుకోగా సెప్టెంబరు నుంచి పంట చేతికొచ్చింది. నేటి వరకు ఒక టన్ను కాకర కాయలను మార్కెట్‌కు తరలించగా రూ.60 వేలు వచ్చాయి. పంట ఇంకా వస్తున్నందున అదనంగా మరో రూ.20 వేలు రావచ్చని అంచనా. పెట్టుబడి రూ.30 వేలు పోను రూ.50 వేలు లాభం గడించారు.


ఒకే రకం కాకుండా

- సుదాం విఠల్, పోతంగల్



ఒకే రకమైన పంట సాగు చేస్తే ఆదాయం వస్తుందన్న నమ్మకం ఉండదు. పలు రకాల పంటలు సాగు చేస్తే ఒక దాంట్లో కాకున్నా మరో దాంట్లో లాభం చేకూరుతుంది. మార్కెట్‌లో ఉన్న డిమాండ్‌కు అనుగుణంగా సాగు చేపడితే లాభాలు వస్తాయి.

ఉల్లిసాగుకు ఇదే సమయం



న్యూస్‌టుడే, బోధన్ గ్రామీణం: ఉల్లికి మార్కెట్లో మంచి డిమాండ్ ఉంది. వినియోగం పెరుగుతుండటంతో ధరలు కూడా నిలకడగా ఉంటున్నాయి. సాగులో రైతులు తగిన జాగ్రత్తలు తీసుకుంటే.. మంచి లాభాలు గడించొచ్చని బోధన్ డివిజన్ ఉద్యానాధికారి వహీద్ జమా తెలిపారు. నవంబరులోగా విత్తుకునే అవకాశం ఉంది. ఉల్లిసాగుకు ఎకరాకు మూడు, నాలుగు కిలోల విత్తనాలు అవసరమవుతాయి. నేలను బాగా దున్ని 120సెం.మీ. వెడల్పు, 15మీటర్ల పొడవైన నారుమళ్లను తయారు చేసుకోవాలి. రెండు కిలోల విత్తనం 200చ.మీ.ల నారుమడికి సరిపోతుంది. విత్తనశుద్ధి తప్పనిసరి. 3 గ్రా. కాప్టాన్ లేదా థైరామ్ కిలో విత్తనానికి కలిపి నారుమడిలో పలుచగా వరుసల్లో పోయాలి. నారుమళ్లలో తెగులు సోకకుండా పది రోజులకోసారి కాపర్ ఆక్సిక్లోరైడ్ 3గ్రా. లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. నారుకు పురుగు ఆశించకుండా కార్బోఫ్యూరాన్ 3జీ గుళికలు నారుమడిలో చల్లి నీరు కట్టాలి. నాటిన 75రోజుల తర్వాత మాలిక్ హైడ్రజైడ్ 2.5గ్రా. లీటర్ నీటికి ద్రావణాన్ని చల్లడంతో మొలక నష్టం బాగా తగ్గుతుంది. నారు నాటిన వంద రోజులకు కాలంజిమ్ లీటరు నీటికి కలిపి పిచికారీ చేస్తే కుళ్లడం దాదాపు తగ్గుతుంది. ఎకరాకు 10టన్నుల పశువుల ఎరువుతో పాటు 80కిలోల నత్రజని, 30కిలోల భాస్వరం, 24కిలోల పొటాష్ వేయాలి. వేరుశనగ పిండి లేదా ఆముదపు పిండిని ఎకరానికి వేసి దోయడం వల్ల ఎక్కువ దిగుబడి వస్తుంది. నత్రజనిని రెండు దఫాలుగా వేసుకుంటే గడ్డ బాగా ఊరుతుంది. ఉల్లి నాటిన 60 రోజుల వరకు 15 రోజుల వ్యవధిలో ఏడు, ఎనిమిది తడులివ్వాలి. కోతకు 15 రోజుల ముందుగా నీరు కట్టడం ఆపివేయాలి. వానాకాలం ఎకరానికి 80 నుంచి 100 క్వింటాళ్ల దిగుబడి వస్తుంది. యాసంగిలో 130 క్వింటాళ్ల వరకు దిగుబడి వచ్చే అవకాశం ఉంటుందని వివరించారు.

రైతు ప్రశ్న సమాధానం

టమాటా పంటలో కాయతొలుచు పురుగు నివారణ తెలుపగలరు? - శంకర్, రైతు, పోతంగల్

సూది పురుగు టమాటాలో సుమారు 20-80శాతం నష్టం కలిగిస్తుంది. దీని నివారణకు ఎకరాకు 4-5 లింగాకర్షక ఎరలు ఏర్పాటు చేసుకోవాలి. పురుగు ఆశించిన కాయలు, పండ్లను ఏరి కాల్చాలి. క్లోరాంట్రనిలిప్రోల్ 18.5శాతం ఎస్.సి.0.2మి.లీ లేదా స్పైనోశాడ్ 0.3మి.లీ లీటరు నీటిలో కలిపి పిచికారీ చేసుకోవాలి.

- డా.రాజ్‌కుమార్, ఉద్యాన శాస్త్రవేత్త, కేవీకే, రుద్రూర్

సరిహద్దుపై నిఘా



పరిశీలన

న్యూస్‌టుడే, కోటగిరి

● ధాన్యం రవాణా కట్టడికి అంతర్రాష్ట్ర తనిఖీ కేంద్రాల ఏర్పాటు

ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు జిల్లా యంత్రాంగం చర్యలు చేపడుతోంది. మన రాష్ట్రంలో రైతులు పండించిన సన్నరకం ధాన్యానికి ప్రభుత్వం మద్దతు ధరతో పాటు రూ.500 బోనస్ ప్రకటించింది. మహారాష్ట్రలో ఈ అవకాశం లేకపోవడంతో ఆ రాష్ట్ర రైతులు పండించిన ధాన్యాన్ని తీసుకొచ్చి ఇక్కడి కర్షకుల పేరిట ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో విక్రయించే అవకాశాలున్నాయి. గతంలోనూ ఈ విధంగా తీసుకొచ్చిన ఉదంతాలు సైతం వెలుగు చూశాయి. ఈ నేపథ్యంలో ఇతర ప్రాంతాల నుంచి పంట ఉత్పత్తులు రాష్ట్రంలోకి రాకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశాలొచ్చాయి. దీంతో వారు ధాన్యం అక్రమ రవాణా నియంత్రణకు శ్రీకారం చుట్టారు. అందులో భాగంగా వ్యవసాయ, ఎక్సైజ్, రెవెన్యూ, పోలీసుశాఖల సంయుక్త ఆధ్వర్యంలో తెలంగాణ - మహారాష్ట్ర సరిహద్దు ప్రాంతాలైన సాలూర, పొతంగల్, కందకుర్తి వద్ద అంతర్రాష్ట్ర తనిఖీ కేంద్రాలు ఏర్పాటు చేశారు.

పొతంగల్‌లో ఆరుగురు అధికారులు..



పొతంగల్ తనిఖీ కేంద్రంలో విధుల నిమిత్తం వ్యవసాయ, ఎక్సైజ్‌శాఖలకు సంబంధించి ఒక అధికారి చొప్పున, రెవెన్యూశాఖకు సంబంధించి ఇద్దరు వీఆర్ఏలు, ఇద్దరు పోలీసు అధికారులను నియమించారు. వీరు 24 గంటల పాటు విధులు నిర్వహిస్తారు. పొతంగల్‌కు మహారాష్ట్ర గ్రామాలు కేవలం 12 కి.మీ దూరంలో ఉండటంతో అధికారులు వాహనాల తనిఖీలు ముమ్మరం చేశారు. వానాకాలం సీజన్, మహారాష్ట్ర ఎన్నికలు పూర్తయ్యేంత వరకు ఈ కేంద్రాలు పనిచేస్తాయి. అక్రమాలకు పాల్పడి తనిఖీల్లో పట్టుబడితే వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు. **- న్యూస్‌టుడే, పొతంగల్**

కందకుర్తిలో..

కందకుర్తి వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్టులో రెవెన్యూ, వ్యవసాయ, పోలీస్‌శాఖల నుంచి ముగ్గురేసి సిబ్బంది రోజుకు మూడు షిఫ్టుల్లో విధులు నిర్వర్తిస్తుండగా తహసీల్దార్ శ్రావణ్‌కుమార్, ఎస్సై ఈ. సాయన్న పర్యవేక్షిస్తున్నారు. మహారాష్ట్ర నుంచి రాష్ట్రంలోకి ప్రవేశించే ప్రతి వాహనాన్ని క్షుణ్నంగా తనిఖీ చేసిన తర్వాతే వదులుతున్నారు.



రెండు రోజుల కిందట కందకుర్తి వద్ద తాత్కాలిక చెక్‌పోస్టు ఏర్పాటు చేసినట్లు తహసీల్దార్ శ్రావణ్‌కుమార్ చెప్పారు. **- న్యూస్‌టుడే, రెంజల్**

సాలూరలో సరిపడా లేని సిబ్బంది..!

బోధన్, సాలూర మండలాల్లోని తనిఖీ కేంద్రాల వద్ద రెవెన్యూ, వ్యవసాయ, పోలీస్, మార్కెటింగ్‌శాఖల అధికారులు నిత్యం నిఘా ఉంచాలనే ఆదేశాలున్నా క్షేత్రస్థాయిలో ఇంకా కార్యరూపం దాల్చలేదు. సాలూర వద్ద ఓ గుడారం లాంటి టెంట్ వేయగా.. అది సోమవారం కురిసిన వర్షానికి కూలిపోయింది. 'న్యూస్‌టుడే' ఫొటో తీసిన విషయాన్ని గుర్తించిన అధికారులు తర్వాత తేరుకొని సరిచేశారు. ఈ కేంద్రంలో నాలుగు ప్రభుత్వశాఖల తరఫున సిబ్బంది ఉండాల్సి ఉండగా.. కేవలం ఓ వీఆర్ఏ, ఒక కానిస్టేబుల్ మాత్రమే విధుల్లో ఉన్నారు. మిగిలిన వ్యవసాయ, మార్కెటింగ్‌శాఖలకు చెందిన సిబ్బంది కనిపించలేదు. ఈ విషయంపై సాలూర తహసీల్దార్ శశిభూషణ్‌ను 'న్యూస్‌టుడే' వివరణ కోరగా అన్నిశాఖలకు చెందిన సిబ్బందితో 24గంటల పాటు తనిఖీ కేంద్రం నిర్వహిస్తున్నామని చెప్పడం గమనార్హం. బోధన్ మండల ఖండ్‌గాం వద్ద కూడా సరైన పర్యవేక్షణ లేదు. **- న్యూస్‌టుడే, బోధన్ గ్రామీణం**



గుడారాన్ని సరిచేస్తున్న పోలీసు, రెవెన్యూ అధికారులు

రాష్ట్రస్థాయి క్విజ్ పోటీలకు ఎంపిక

నిజామాబాద్ విద్యావిభాగం, న్యూస్‌టుడే: జిల్లా ఎయిడ్స్ కంట్రోల్ విభాగం ఆధ్వర్యంలో సోమవారం పాఠశాల విద్యార్థులకు నిర్వహించిన జిల్లాస్థాయి క్విజ్ పోటీలో శంకర్‌భవన్ ఉన్నత పాఠశాల విద్యార్థులు షేక్ షానవాజ్, చంద్రజ జట్టు ప్రథమ స్థానంలో నిలిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు వాసుదేవరావు తెలిపారు.



ఓ గ్లాసు పెట్టించండి సారూ..

కామారెడ్డి కలెక్టరేట్‌కి వివిధ పనుల నిమిత్తం వచ్చే ప్రజల దాహార్తిని తీర్చేందుకు నీటి శుద్ధీకరణ యంత్రాలు అమర్చారు. ఇది బాగానే ఉన్నా.. నీరు తాగడానికి ఇక్కడ ఓ గ్లాసు అందుబాటులో లేకపోవడంతో ఇలా చేతితో తాగుతున్నారు. ఇక్కడ రెండు గ్లాసులు పెట్టించాలని ప్రజలు కోరుతున్నారు. ఈ విషయమై 'న్యూస్‌టుడే' కలెక్టరేట్ ఏవో మసూద్ అహ్మద్‌ను వివరణ కోరగా.. మంగళవారం నుంచి అందుబాటులో ఉంచుతామని తెలిపారు.

– న్యూస్‌టుడే, కామారెడ్డి కలెక్టరేట్

రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు పేట్ సంగెం క్రీడాకారులు

గాంధారి, న్యూస్‌టుడే: ఉమ్మడి కరీంనగర్‌లోని బెల్లంపల్లిలో ఈ నెల 28 నుంచి జరిగే రాష్ట్రస్థాయి అండర్-17 వాలీబాల్ పోటీలకు పేట్‌సంగెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన బానోత్ ఉష, కొర్రి సృజన ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు కుమారస్వామి తెలిపారు. ఆదివారం జరిగిన పోటీల్లో కామారెడ్డి జిల్లా నుంచి పోటీ పడి వీరు రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు వ్యాయామ ఉపాధ్యాయులు లక్ష్మణ్ రాథోడ్ పేర్కొన్నారు. విద్యార్థులను పాఠశాల ఉపాధ్యాయ బృందం అభినందించింది.



బానోత్ ఉష, కొర్రి సృజన

ప్రజా సంబంధాలు ఉన్న వారికే టికెట్లు

నిజామాబాద్ అర్బన్, న్యూస్‌టుడే: త్వరలోనే వచ్చే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థి గెలిచేందుకు ప్రతి కార్యకర్త కృషి చేయాలని టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేశ్ కుమార్‌గౌడ్ పిలుపునిచ్చారు. యువజన కాంగ్రెస్, ఎన్ఎస్‌యూఐ ఆధ్వర్యంలో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటర్ల నమోదుపై బస్వాగార్డెన్‌లో సోమవారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. డిగ్రీ పూర్తయిన యువతను ఎక్కువ సంఖ్యలో నమోదు చేయించాలన్నారు. 2018లో ప్రతిపక్షంలో ఉన్నా జీవన్‌రెడ్డి ఎమ్మెల్సీగా గెలిచారని, ఇప్పుడు మనమే అధికారంలో ఉన్నామన్నారు. మంత్రులు, ఎమ్మెల్యేలు, నాయకులు ఎన్నికను ప్రతిష్ఠాత్మకంగా తీసుకోవాలని కోరారు. తాము అధికారంలోకి వచ్చిన పది నెలల్లోనే 55 వేల ఉద్యోగాలు ఇచ్చామన్నారు. వాస్తవాలు క్షేత్రస్థాయిలో వివరించాలని చెప్పారు. భారాస హయాంలో విస్మరించిన విద్య, వైద్య రంగాలను మెరుగుపరిచేందుకు సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేక దృష్టి సారించారని చెప్పారు. ప్రజలతో సంబంధాలు ఉండి, విజయం సాధిస్తారనే వారికే స్థానిక సంస్థల ఎన్నికల్లో టికెట్ల కేటాయింపు ఉంటుందని స్పష్టం చేశారు. జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ.. భారాస, భాజపా విమర్శలను తిప్పికొట్టాలని సూచించారు. డిగ్రీ పూర్తయిన వారందరితో నవంబరు 6వ తేదీ వరకు ఓటు నమోదు చేయించాలన్నారు. సమావేశంలో ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, ఎమ్మెల్యేలు సుదర్శన్‌రెడ్డి, భూపతిరెడ్డి, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, కార్పొరేషన్ల ఛైర్మన్లు తాహెర్, ఈరవత్రి అనిల్, మానాల మోహన్‌రెడ్డి, నుడా ఛైర్మన్ కేశ వేణు, నాయకులు అరికెల నర్సారెడ్డి, ఏనుగు రవీందర్‌రెడ్డి, కామారెడ్డి డీసీసీ అధ్యక్షుడు కైలాస్ శ్రీనివాస్, యువజన కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రామర్తి గోపి, జిల్లా అధ్యక్షుడు విక్కీ యాదవ్, నగర అధ్యక్షుడు ప్రీతం, ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు వేణురాజ్, విపుల్ పాల్గొన్నారు.



ఓటరు నమోదు ప్రక్రియను ఆన్‌లైన్‌లో పరిశీలిస్తున్న టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్‌గౌడ్, మంత్రి జూపల్లి కృష్ణారావు, కాంగ్రెస్ నేతలు



నృత్య ప్రదర్శన చేస్తున్న సోమాయప్ప స్వామి

భక్తిమార్గం అనుసరణీయం

జుక్కల్, న్యూస్‌టుడే: రాష్ట్ర సరిహద్దు ప్రాంతం మహారాష్ట్రలోని దెగ్లూర్‌లో సోమవారం నిర్వహించిన భక్తి కార్యక్రమానికి జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావు హాజరయ్యారు. బిచ్కుందలోని సద్గురు బండాయప్ప మఠాధిపతి సోమాయప్ప ఆధ్వర్యంలో దెగ్లూర్‌లోని కాశీ విశ్వనాథ మఠంలో శ్రీపంచముఖేశ్వర శివలింగ విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం నిర్వహించారు. వేలాది మంది భక్తులు సరిహద్దు ప్రాంతాల నుంచి తరలొచ్చారు. ప్రవచన, నృత్య ప్రదర్శనతో సోమాయప్ప భక్తులకు ఉపదేశం చేశారు. భక్తిమార్గంలో నడుస్తూ.. ప్రాంతాభివృద్ధికి సహకరించాల్సిన అవసరం అందరిపై ఉందని ఎమ్మెల్యే లక్ష్మీకాంతరావు పేర్కొన్నారు.

24న విద్యుత్తు శాఖ బహిరంగ విచారణ

నిజామాబాద్ అర్బన్, న్యూస్‌టుడే: టీజీ ఎన్పీడీసీఎల్ ఆధ్వర్యంలో ఈ నెల 24న జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో బహిరంగ విచారణ ఉంటుందని ఆ శాఖ జిల్లా ఎస్ఈ రవీందర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 గంటలకు జరిగే కార్యక్రమానికి విద్యుత్తు నియంత్రణ మండలి(ఈఆర్‌సీ) ఛైర్మన్ తన్నీరు శ్రీరంగరావు, సభ్యులు మనోహర్‌రాజు(టెక్నికల్), బండారు కృష్ణయ్య(ఫైనాన్స్) హాజరవుతారని చెప్పారు. విద్యుత్తు శాఖలో టారిఫ్‌కు సంబంధించిన ఏవైనా పొరపాట్లు, కేటగిరి మార్పులో ఇబ్బంది కలిగితే ఆయా సమస్యలను వారి దృష్టికి తీసుకెళ్లవచ్చని పేర్కొన్నారు.

దేవగిరి ఆరుగంటలు ఆలస్యం

ఇందూర్ సిటీ, న్యూస్‌టుడే: దేవగిరి ఎక్స్‌ప్రెస్ సోమవారం ఆరుగంటలు ఆలస్యంగా నిజామాబాద్ రైల్వే స్టేషన్ చేరుకుంది. ముంబయి దాదర్ రైల్వేస్టేషన్ నుంచి ఆదివారం రాత్రి 9.42 గంటలకు ప్రారంభం కావాల్సిన రైలు సాంకేతిక కారణాల వల్ల 12.32 (వేకువ జామున) ప్రారంభమైంది. నిజామాబాద్ రైల్వే స్టేషన్‌కు ఉదయం 11.08 గంటలకు రావాల్సి ఉండగా సాయంత్రం 4.26 చేరుకుంది. ఆలస్యం కావడంతో ప్రయాణికులు గందరగోళానికి గురయ్యారు.



బహుమతి అందుకుంటున్న ఎల్లారెడ్డి బృందం

ఓవరాల్ ఛాంపియన్ ఎల్లారెడ్డి జట్టు

గాంధారి, న్యూస్‌టుడే: జిల్లా స్థాయి ఎస్‌జీఎఫ్ వాలీబాల్ పోటీల్లో ఓవరాల్ ఛాంపియన్‌గా ఎల్లారెడ్డి జోన్ జట్టు నిలిచినట్లు వ్యాయామ ఉపాధ్యాయుడు లక్ష్మణ్ రాథోడ్ సోమవారం తెలిపారు. అండర్-14 విభాగంలో బాలురు, బాలికల జట్లు ప్రథమ స్థానాలు సాధించగా, అండర్-17 విభాగంలో ఎల్లారెడ్డి జోన్ బాలబాలికల జట్లు మొదటి స్థానం సాధించారు. కబడ్డీలో అండర్-17 బాలురు, బాలికలు, అండర్-14 బాలుర జట్లు ప్రథమ స్థానాలు కైవసం చేసుకున్నట్లు పేర్కొన్నారు. ఈ పోటీల్లో ఎల్లారెడ్డి, గాంధారి, నాగిరెడ్డిపేట్ మండల క్రీడాకారులు పాల్గొన్నారు. ఎమ్మెల్యే మదన్‌మోహన్ చరవాణిలో విద్యార్థులతో మాట్లాడి అభినందించారు. క్రీడల ద్వారా ఉద్యోగాలు సాధించుకోవాలని సూచించారు. ఎల్లారెడ్డి జోన్‌లోని వ్యాయామ ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

భిక్కనూరు, న్యూస్‌టుడే: అండర్-17 రాష్ట్రస్థాయి బాలికల విభాగం కబడ్డీ పోటీలకు భిక్కనూరు జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన పదో తరగతి విద్యార్థిని బత్తుల చందన ఎంపికైంది. ఈ నెల 20న నిజామాబాద్‌లోని డిస్ట్రిక్ట్ స్పోర్ట్స్ అథారిటీ గ్రౌండ్‌లో జరిగిన జిల్లా స్థాయి కబడ్డీ పోటీల్లో ఉత్తమ ప్రతిభచాటడంతో ఎంపికైనట్లు పాఠశాల ప్రిన్సిపల్ శ్రీనాథ్ తెలిపారు. నవంబరు 3 నుంచి 5వ తేదీ వరకు మహబూబ్‌నగర్‌లో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో చందన ఉమ్మడి జిల్లా తరపున పాల్గొననున్నట్లు పీడీ నర్సింహారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థినిని ఉపాధ్యాయులు, గ్రామస్థులు అభినందించారు.

సత్తాచాటిన అథ్లెట్లు

కామారెడ్డి క్రీడావిభాగం: సౌత్‌జోన్ జూనియర్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్-2024లో జిల్లా అథ్లెట్లు సత్తాచాటారు. ఈ నెల 17 నుంచి 19వ తేదీ వరకు ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరులో నిర్వహించిన టోర్నీలో మూడు పతకాలు కైవసం చేసుకున్నారు. 400 మీటర్ల మిక్స్‌డ్ రిలే పోటీలో ఈశ్వర్ స్వర్ణం, 1600 మీటర్ల రిలేలో సెహ్వాగ్, ట్రయథ్లాన్‌లో ప్రవీణ్ రజత పతకాలు సాధించారు. విజేతలను జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు జైపాల్‌రెడ్డి, డాక్టర్ అనిల్‌కుమార్ అభినందించారు.

అండర్ -19 ఫుట్‌బాల్‌లో..

నిజామాబాద్ క్రీడావిభాగం, న్యూస్‌టుడే: జిల్లా కేంద్రం రాజారాం స్టేడియంలో సోమవారం అండర్-19 బాలుర విభాగంలో ఫుట్‌బాల్ ఎంపికలు పూర్తయ్యాయని పీడీ ప్రసాద్ తెలిపారు. ఉమ్మడి నిజామాబాద్ జిల్లా ఇంటర్ విద్యార్థులు పాల్గొన్నారని పేర్కొన్నారు. ఎంపికైన క్రీడాకారులు రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. పీఈటీలు అనిల్, ఆమెర్ తదితరులు పాల్గొన్నారు.

పాము కాటుతో రైతు మృతి

మాచారెడ్డి, న్యూస్‌టుడే: పాము కాటుతో రైతు మృతి చెందిన ఘటన మాచారెడ్డి మండలం బండరామేశ్వర్‌పల్లి గ్రామంలో సోమవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన నల్లాల రాములు(60) వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నారు. రోజూ మాదిరిగానే పొలంలో పని ఉందని వెళ్లారు. సాయంత్రం అయినా రాములు ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళన చెంది పొలానికి వెళ్లి చూడగా.. పాము కాటుకు గురై అప్పటికే మృతి చెంది ఉన్నారు. ఆయన అల్లుడు నరేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై అనిల్ తెలిపారు.

ఏషియన్ ప్రియా సినీప్లెక్స్

ఈనాడు సినిమాలు

ఏషియన్ ప్రియా సినీప్లెక్స్	వెట్టయాన్ ది హంటర్ 11.00 2.15 6.00 9.15; విశ్వం 11.00 2.00 6.00 9.00
వీ సినిమాస్	దేవర 5.50 9.15
ఏషియన్ దర్శన్	మార్టిన్ 6.00, 9.00

– న్యూస్‌టుడే, కామారెడ్డి పట్టణం

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)

బాన్సువాడ 83284 29129

కామారెడ్డి 93970 82242



● **సమస్య:** జిల్లా కేంద్రంలోని పాత బస్టాండు ప్రాంతంలో కోతుల బెడద నెలకొంది. గతంలో ఫిర్యాదు చేసినా చర్యలు లేవు. **- పూర్ణ, రాజు, రాంచంద్రం, పాత బస్టాండు**

సమాధానం: కోతుల నియంత్రణకు తగిన చర్యలు చేపడతాం. పట్టుకోవడానికి అటవీ శాఖ సిబ్బందికి సూచిస్తాం. **- పర్వేజ్, శానిటరీ ఇన్‌స్పెక్టర్**

● **సమస్య:** 8, 9వ వార్డుల్లో కాలువల్లో మురుగు తీయడం లేదు. దోమలు వ్యాప్తి చెందుతున్నాయి. **- కుమార్, దోమకొండ**

సమాధానం: పరిశీలించి, సిబ్బందిచే మురుగు తీయిస్తాం. **- దయాకర్‌రెడ్డి, గ్రామ కార్యదర్శి, దోమకొండ**



● **సమస్య:** పాత బాన్సువాడలో పలు చోట్ల చెత్త సేకరణ వాహనాలు సమయానికి రాక పోవడంతో ఇబ్బందిగా ఉంది. **- రాజు, బాన్సువాడ**

పరిష్కారం: ఈ విషయాన్ని పర్యావరణ ఇంజినీర్ హన్మాండ్లు దృష్టికి తీసుకెళ్లగా ఆయన సిబ్బంది చేత చెత్త సేకరణ చేయించి సమస్య పరిష్కరించారు.

● **సమస్య:** పిట్లం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో పిచ్చి మొక్కలు, వ్యర్థాలు పేరుకుపోయాయి. **- సుధాకర్, స్థానికుడు**

సమాధానం: పిచ్చి మొక్కలు తొలగించేయిస్తాం. **- యాదగిరి, పంచాయతీ కార్యదర్శి, పిట్లం.**

● **సమస్య :** మోషంపూర్ గ్రామంలో పంచాయతీరాజ్ రోడ్డు పక్కన పైపులైను నుంచి నీరు వృథాగా పోతోంది. **- సంతోష్, గ్రామస్థుడు.**

సమాధానం : సిబ్బందితో మరమ్మతులు చేయించి సమస్యను పరిష్కరిస్తాను. **- ప్రశాంత్, పంచాయతీ కార్యదర్శి**

» సమస్య: వేణుగోపాలస్వామి రోడ్డులో చెత్త సేకరణకు సిబ్బంది రావడం లేదు. తగిన చర్యలు తీసుకోవాలి. **- చంద్రయ్య, స్థానికుడు**



☛ స్పందన: ఫిర్యాదు మేరకు చెత్త సేకరణ చేపట్టాం. పారిశుద్ధ్యం లేకుండా చర్యలు చేపట్టాం. **- పర్వేజ్, శానిటరీ ఇన్‌స్పెక్టర్**

» సమస్య: జిల్లా కేంద్రంలోని అంజంపురలో వ్యర్థాలు పేరుకుపోయాయి. **- రఫీక్, అజంపుర**





☛ స్పందన: ఫిర్యాదు మేరకు చెత్త తొలగింపునకు సిబ్బందికి ఆదేశాలిచ్చాం. పారిశుద్ధ్య స్థితిని మెరుగుపరిచేందుకు చర్యలు చేపట్టాం. **- పర్వేజ్, శానిటరీ ఇన్‌స్పెక్టర్**

» సమస్య: జిల్లా కేంద్రంలోని బడా కసాబ్ గల్లీలో మురుగు కాల్వ పూడిక పేరుకుపోయింది. **- పాండు, బడాకసాబ్‌గల్లీ**



☛ స్పందన: కాల్వ పూడికతీతకు చర్యలు చేపట్టాం. పారిశుద్ధ్య సమస్య లేకుండా శ్రద్ధ చూపాం. **- పర్వేజ్, శానిటరీ ఇన్‌స్పెక్టర్**

» సమస్య: హస్గుల్ గ్రామంలో మురుగు కాల్వలు చెత్తతో అధ్వానంగా మారాయి.



☛ పరిష్కారం: కార్మికులతో కాల్వలను శుభ్రం చేయించాం. **- రమేష్, పంచాయతీ కార్యదర్శి, హస్గుల్**

– న్యూస్‌టుడే, కామారెడ్డి పట్టణం, దోమకొండ, బాన్సువాడ పట్టణం, పిట్లం, రామారెడ్డి, బిచ్కుంద గ్రామీణం

వినృవించాం..పరిష్కరించండి..

● ప్రజావాణికి వినతుల వెల్లువ



అర్జీదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్

కామారెడ్డి కలెక్టరేట్, న్యూస్‌టుడే: సమీకృత జిల్లా కార్యాలయాల భవనంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి వినతులు వెల్లువెత్తాయి. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన దరఖాస్తు దారులు తమ సమస్యలను త్వరగా పరిష్కరించాలని కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్‌కు అర్జీలు అందజేశారు. కొందరు అర్జీదారులు న్యూస్‌టుడే వద్ద వారి గోడు చెప్పుకున్నారు..

నా భూమిని ఆక్రమిస్తున్నారు..

- స్వామిగౌడ్, చింతమాన్‌పల్లి (దోమకొండ)



ప్రభుత్వం మా నాన్నకు 40 ఏళ్ల క్రితం కామారెడ్డి మండలం రాఘవపూర్‌లో మూడెకరాల సాగు భూమిని ఇచ్చింది. అప్పటి నుంచి అదే భూమిని సాగు చేసుకుంటూ జీవిస్తున్నాం. ఇటీవల పక్కన ఉన్న ఓ వ్యక్తి మా భూమిని ఆక్రమిస్తున్నాడు. ఇదేమిటని ప్రశ్నిస్తే దౌర్జన్యం చేస్తున్నాడు. అన్ని ధ్రువ పత్రాలు ఉన్నాయి. విచారణ చేయించి నాకు న్యాయం చేయాలి.

నాలుగు నెలలైనా పేరు మార్చడం లేదు

- ఇంద్రసేనారెడ్డి, లింగాపూర్ (కామారెడ్డి)



గ్రామంలో మా నాన్న బాల్‌రెడ్డి పేరిట 1.05 ఎకరాల సాగు భూమి ఉంది. ఈ ఏడాది మార్చి నెలలో మా నాన్న మృతి చెందాడు. ఆయన వారసులమైన మా సోదరులకు మా నాన్న పేరిట ఉన్న భూమిని సమానంగా మార్పిడి చేయాలని మీ-సేవాలో ఫౌతి కింద దరఖాస్తు పెట్టుకున్నాం. ఇప్పటికి నాలుగు నెలలైనా పేరు మార్చడం లేదు. ఫైల్ అదనపు కలెక్టర్ వద్ద పెండింగ్‌లో ఉందని చెబుతున్నారు.

ఉపాధి చూపించాలి

- లింబాద్రి, మాచారెడ్డి



నేను మూడు మార్లు జీవనోపాధి కోసం గల్ఫ్‌దేశాలకు వెళ్లి వచ్చాను. వెళ్లిన ప్రతిసారి ఆరోగ్యం సహకరించక పోవడంతో ఏడాదిలోపు స్వదేశానికి తిరిగి వచ్చాను. ఎలక్ట్రికల్ టెక్నీషియన్‌గా పనిచేసిన అనుభవం ఉంది. ప్రభుత్వ సంస్థల్లో ఏదైనా ఉద్యోగం ఇచ్చి ఆదుకోవాలి.

డయాలసిస్ రోగులకు పింఛన్లు ఇవ్వాలి

జిల్లాలోని డయాలసిస్ రోగులకు ప్రభుత్వం పింఛన్లు ఇవ్వాలి. గతంలో కొందరికి మాత్రమే మంజూరు చేశారు. ఆంధ్రప్రదేశ్‌లో డయాలసిస్ రోగులకు అక్కడి ప్రభుత్వం నెలకు రూ.10వేల పింఛన్ ఇస్తోంది. అదే మాదిరిగా తెలంగాణలోనూ అమలు చేయాలి. నెలకు రూ.8 వేల వరకు మందులు, రోగ నిర్ధారణ పరీక్షలకే ఖర్చవుతుంది. ప్రభుత్వం పెద్ద మనసుతో పింఛన్లు మంజూరు చేయాలి.



ఎక్కడి వారు అక్కడే...

జిల్లా కలెక్టరేట్‌లో ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1.00 గంట వరకు నిర్వహించే ప్రజావాణికి జిల్లాలోని అన్ని ప్రాంతాల నుంచి ప్రజలు అర్జీలు ఇవ్వడానికి కలెక్టరేట్‌కు వస్తుంటారు. బీబీపేట జ్యోతిబా పులే పాఠశాల తల్లిదండ్రుల కమిటీ ప్రతినిధులు సోమవారం ధర్నాకు రావడంతో మధ్యాహ్నం 12.30 గంటలకే పోలీసులు గేట్లు మూసివేయించారు. గతంలో ఇలాంటి ధర్నాలు జరిగినప్పుడు ప్రధాన గేట్లు మూసి వేసి కొంత దూరంలోని రెండో గేటు తెరిచే ఉండేది. కాని ఈ సోమవారం రెండు మూసివేసి అర గంట వరకు తెరవలేదు. దీంతో కలెక్టరేట్ వచ్చే అర్జీదారులు, ఇతర పనుల నిమిత్తం వచ్చిన వారు ఇబ్బందులు పడ్డారు. ప్రజావాణి ముగిసిన తర్వాత గేట్లు తెరిచారు.

– న్యూస్‌టుడే, కామారెడ్డి కలెక్టరేట్



లోపలికి రావడానికి కలెక్టరేట్ ప్రధాన గేటు వద్ద వేచి ఉన్న అర్జీదారులు



బయటకు వెళ్లడానికి నిరీక్షిస్తున్న వాహనదారులు





పూజలందుకున్న చాముండేశ్వరీ అమ్మవారు

వైభవంగా ఆలయ వార్షికోత్సవం

దోమకొండ, న్యూస్‌టుడే: దోమకొండలో చాముండేశ్వరీ ఆలయ 53వ వార్షికోత్సవం సోమవారం వైభవంగా నిర్వహించారు. అమ్మవారికి ఫల పంచామృతాభిషేకం, అలంకరణ, మహా హారతి, తీర్థ ప్రసాద వితరణ, అన్నదానం నిర్వహించారు. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ ఉత్సవ కమిటీ ప్రతినిధులు సిద్ధారెడ్డి, వెంకటేశం, రమేశ్, బాల్‌రాజు, వాలంటీర్లు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ప్రత్యేక రిజర్వేషన్ కేటాయించాలని వినతి

బాన్సువాడ పట్టణం, న్యూస్‌టుడే: ఎస్సీ వర్గీకరణలో బేడ బుడగ జంగం కులస్థులకు ప్రత్యేక రిజర్వేషన్ కేటాయించాలని సోమవారం సంఘం ప్రతినిధులు సబ్‌కలెక్టర్ కిరణ్మయికి వినతిపత్రం అందజేశారు. సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు అంజయ్య, అయ్యాల సంతోష్, దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినికి సాయం

నాగిరెడ్డిపేట, న్యూస్‌టుడే: మండల కేంద్రానికి చెందిన బెస్త కావేరి ఎంబీబీఎస్ సీటు సాధించడంతో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సోమవారం విద్యార్థినిని సన్మానించి రూ.10 వేల నగదు అందజేశారు. అధ్యక్షుడు శ్రీధర్‌గౌడ్, నాయకులు రామచంద్రారెడ్డి, విఠల్ రెడ్డి, సుధాకర్, షాహిద్,శ్రీరాంగౌడ్, సురేందర్ గౌడ్, గులాం, సాయగౌడ్, ఫారుఖ్ తదితరులు ఉన్నారు.

ముందస్తు చిత్ర ప్రదర్శన

కామారెడ్డి పట్టణం, న్యూస్‌టుడే: జిల్లా కేంద్రంలోని దర్శన్ థియేటర్‌లో సోమవారం కామారెడ్డి ప్రాంతానికి చెందిన నిర్మాత తిమ్మయ్య గారి వేణుగోపాల్‌రెడ్డి నిర్మించిన లగ్గం సినిమా ముందస్తు ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. తెలంగాణ ప్రాంత మానవ సంబంధాలను సినిమాలో చూపించామన్నారు. పుర ప్రతినిధులు, కౌన్సిలర్లు ఆయా వర్గాలకు చెందిన వారు పాల్గొన్నారు.



భిక్కనూరు కూడలిలో నిరసన తెలుపుతున్న బజరంగ్‌దల్ కార్యకర్తలు



పెద్దకొడప్‌గల్‌లో..

‘దాడికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలి’

న్యూస్‌టుడే, బృందం: హిందూ దేవాలయాలపై జరుగుతున్న దాడులను ఖండిస్తూ సోమవారం జిల్లా వ్యాప్తంగా బజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శనలు నిర్వహించారు. సికింద్రాబాద్ ముత్యాలమ్మ ఆలయంపై జరిగిన దాడి హిందువుల మనోభావాలను తీవ్రంగా దెబ్బ తీసిందని, బాధ్యులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.



సదాశివనగర్‌లో...

నేడు పిట్లం బంద్‌కు పిలుపు


పిట్లం, న్యూస్‌టుడే: హిందూ దేవాలయాలపై దాడికి నిరసనగా హిందూ సంఘాల ఆధ్వర్యంలో మంగళవారం పిట్లం బంద్‌కు పిలుపునిచ్చినట్లు వారు తెలిపారు. ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా బంద్‌లో పాల్గొని సహకరించాలని కోరారు.

బాన్సువాడ పట్టణం : మంగళవారం బాన్సువాడ బంద్‌ను చేపట్టనున్నట్లు హిందూ సంఘాల ప్రతినిధులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వ్యాపార సముదాయాలు మూసేసి స్వచ్ఛందంగా బంద్‌లో పాల్గొనాలని కోరారు.

నూతన కార్యవర్గం ఏర్పాటు



దేవిసింగ్



భీమ్‌రావు

నిజాంసాగర్, న్యూస్‌టుడే: నిజాంసాగర్ మండల ఎస్సీ ఎస్టీ ఉపాధ్యాయ సంఘం నూతన కార్యవర్గం ఏర్పాటు చేసినట్లు జిల్లా ప్రధాన కార్యదర్శి శంభ్యనాయక్ తెలిపారు. సోమవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో నర్సింగ్‌రావుపల్లి ఎంపీయూపీఎస్ పాఠశాల ఉపాధ్యాయుడు దేవిసింగ్‌ని అధ్యక్షునిగా, మాగి యూపీఎస్ ఉపాధ్యాయుడు భీమ్‌రావును ప్రధాన కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. సంఘ సభ్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చరవాణుల అప్పగింత

బిచ్కుంద, న్యూస్‌టుడే: బిచ్కుందకు చెందిన సంతోష్, హస్గుల్‌కు చెందిన మహేష్, పెద్దతక్కడ్‌పల్లికి చెందిన రాజు ఇటీవల తమ చరవాణులు పోగొట్టుకున్నారు. ఠాణాలో ఫిర్యాదు చేయడతో సీఈఐఆర్ పోర్టల్ ద్వారా గుర్తించి తిరిగి బాధితులకు అప్పగించినట్లు ఎస్సై తెలిపారు.

ప్రగతికి చేయూతనివ్వండి...

పెద్దకొడప్‌గల్, న్యూస్‌టుడే: జుక్కల్ నియోజకవర్గానికి ఎస్సీ కార్పొరేషన్ ద్వారా ఆర్థిక ఫలాలు అందేలా కృషి చేయాలని రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ ఛైర్మన్ ప్రీతమ్‌కు నియోజకవర్గ ఎస్సీ సెల్ ఛైర్మన్ అరవింద్ విజ్ఞప్తి చేశారు. సోమవారం హైదరాబాద్‌లో ప్రీతమ్‌ను మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు. కామారెడ్డి, మేడ్చల్ జిల్లాల అధ్యక్షులు మద్దెల భాగయ్య, పత్తి కుమార్ తదితరులు ఉన్నారు.

‘రైతు భరోసా ఇవ్వాల్సిందే’

జుక్కల్ : ఎకరాకు రూ. 15వేల చొప్పున ప్రభుత్వం రైతు భరోసా ఇవ్వాల్సిందేనని భారాస నాయకుడు నీలుపటేల్ డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలో ధర్నా చేపట్టారు. నాయకులు వెంకట్ గౌడ్, సుంకరి వెంకటి, బొల్లి గంగాధర్, వాగ్మరే మొగులాజీ, కిరణ్, శివాజీ, గజిరే రాజు, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంఈవో వెంకటేశం

సమయపాలన పాటించాలి

ఎల్లారెడ్డి, న్యూస్‌టుడే : ఉపాధ్యాయులందరూ సమయపాలన పాటించాలని ఎంఈవో వెంకటేశం అన్నారు. ఎల్లారెడ్డి మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం నూతనంగా విధుల్లోకి చేరిన ఉపాధ్యాయులకు ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. విద్యార్థులతో ఏ విధంగా ఉండాలి. .. విధులు, బాధ్యతలను వివరించారు. కార్యక్రమంలో కాంప్లెక్సు ప్రధానోపాధ్యాయులు వెంకటేశ్వర్‌రావు, మాణిక్యం, సిబ్బంది అశోక్, కాశీరాం పాల్గొన్నారు.



బాధిత కుటుంబానికి పరామర్శ

బాన్సువాడ, న్యూస్‌టుడే: పట్టణ కాంగ్రెస్ నాయకుడు, మాజీ ఎంపీపీ ఎజాస్ సోదరి మృతి చెందడంతో ఆయన కుటుంబాన్ని ఆదివారం రాత్రి ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి పరామర్శించారు.

అభివృద్ధి చూసి ఓర్వలేకపోతున్నారు

రామారెడ్డి, న్యూస్‌టుడే: భారాస నాయకులు అభివృద్ధి చూసి ఓర్వలేకపోతున్నారని మాజీ జడ్పీటీసీ సభ్యుడు మోహన్‌రెడ్డి అన్నారు. సోమవారం రామారెడ్డిలో విలేకరుల సమావేశం నిర్వహించారు. జిల్లా ఉపాధ్యక్షుడు మహేందర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, వైస్ ఛైర్మన్ పశుపతి, కిషన్, రాజు, నర్సింలు, రెడ్డి రాతుల, రావూఫ్ పాల్గొన్నారు.

కల్తీ కల్లు విక్రయంపై ఫిర్యాదు

దోమకొండ, న్యూస్‌టుడే: ముత్యంపేటలో ఎల్లమ్మ గుడి వద్ద కల్తీ కల్లు విక్రయిస్తున్నారని ఆరోపిస్తూ సోమవారం గ్రామస్థులు బసిరెడ్డి, రవీందర్‌రెడ్డి, నరేందర్ రెడ్డి తదితరులు అధికారులకు ఫిర్యాదు చేశారు.సాయంత్రం ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు దోమకొండ ఆబ్కారీ ఎస్సై సుదర్శన్ సిబ్బందితో కలిసి వెళ్లి కల్లు డిపోపై దాడులు చేశారు. నమూనాలు సేకరించారు. నిర్వాహకుడిపై కేసు నమోదు చేసినట్లు సీఐ మధుసూదన్‌రావు తెలిపారు.

అంత్యక్రియలు చేసి ... అనంత లోకాలకు...

పిట్లం, న్యూస్‌టుడే: అంత్యక్రియల అనంతరం స్నానానికి వెళ్లి ప్రమాదవశాత్తు చెరువులో పడి వ్యక్తి మృతి చెందిన ఘటన సోమవారం పిట్లం మండలం గౌరారంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం...గౌరారంకు చెందిన సాయిలు(42) అదే గ్రామంలో రెండు రోజుల కిందట కులస్థుల అంత్యక్రియల్లో పాల్గొని స్థానిక చెరువులో స్నానానికి వెళ్లాడు. తిరిగి ఇంటికి రాలేదు. సోమవారం చెరువు వైపు వెళ్లిన గ్రామస్థులకు మృతదేహం కనిపించడంతో వెళ్లి చూడగా సాయిలుగా గుర్తించి కుటుంబీకులకు సమాచారం ఇచ్చారు. ప్రమాదవశాత్తు చెరువులో పడి మరణించాడని మృతుని తల్లి పోచవ్వ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేయనున్నట్లు పోలీసులు తెలిపారు. మృతుడికి ఇద్దరు కుమారులు ఉన్నారు. మృతదేహాన్ని శవపరీక్షల నిమిత్తం బాన్సువాడ ప్రాంతీయ ఆసుపత్రికి తరలించారు.

క్రైమ్ కార్నర్

రైలు కిందపడి ఉపాధ్యాయుడి ఆత్మహత్య

నిజామాబాద్ నేరవిభాగం, న్యూస్‌టుడే: సిర్నపల్లి - ఉపల్‌వాయి మధ్య ఆదివారం రాత్రి గూడ్స్ రైలు కిందపడి ఉపాధ్యాయుడు ఆత్మహత్య చేసుకున్నాడు. కేసు నమోదు చేసుకొని రైల్వే పోలీసులు దర్యాప్తు ప్రారంభించగా.. కామారెడ్డి జిల్లా ఎల్లారెడ్డికి చెందిన వినయ్‌కుమార్(40)గా గుర్తించారు. ఆత్మహత్యకు కారణాలు తెలియరాలేదని రైల్వే ఎస్సై సాయిరెడ్డి తెలిపారు. వినయ్‌కుమార్‌కు ఇద్దరు పిల్లలున్నారు.

భార్యను వేధించిన భర్తకు జైలు, జరిమానా

సిరిసిల్ల గ్రామీణం, న్యూస్‌టుడే: అదనపు కట్నం కోసం భార్యను వేధించిన భర్తకు జైలు శిక్షతో పాటు జరిమానా విధిస్తూ సిరిసిల్ల కోర్టు జడ్జి ప్రవీణ్ సోమవారం తీర్పు వెల్లడించినట్లు ముస్తాబాద్ ఎస్సై గణేశ్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం... కామారెడ్డి జిల్లా దోమకొండ మండలం తుల్జాపూర్ గ్రామానికి చెందిన సుంకరి రాజుకు ముస్తాబాద్ మండలం గూడెం గ్రామానికి చెందిన మేఘమాలతో 2010 సంవత్సరంలో వివాహం జరిగింది. వీరికి ఒక కుమారుడు ఉన్నాడు. కొన్నేళ్ల తర్వాత అదనపు కట్నం తీసుకురావాలని భార్యను వేధింపులకు గురిచేయడంతో 2015లో ముస్తాబాద్ పోలీస్ స్టేషన్‌లో భర్త రాజుపై ఫిర్యాదు చేయగా అరెస్టు చేశారు. కోర్టులో నేరం రుజువు కావడంతో నిందితుడికి ఏడాదిన్నర జైలు శిక్షతోపాటు రూ.10 వేల జరిమానా విధిస్తూ తీర్పు చెప్పినట్లు ఎస్సై తెలిపారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ కింద కేసులు నమోదు

బీర్కూర్, న్యూస్‌టుడే: బీర్కూర్‌లో సోమవారం పోలీసులు వాహన తనిఖీలు చేపట్టారు. మద్యం తాగి వాహనాలు నడిపిస్తున్న ఇద్దరు చోదకులకు డ్రంక్ అండ్ డ్రైవ్ కింద కేసులు నమోదు చేసినట్లు ఎస్సై రాజశేఖర్ తెలిపారు. కాంటాక్ట్ నాన్ కాంటాక్ట్ కింద 50 మంది వాహనదారులకు జరిమానాలు విధించామని ఎస్సై చెప్పారు.



నాగిరెడ్డిపేటలో...



చిన్నకొడప్‌గల్ శివారులో నల్లబడిన పత్తి



పుల్కల్‌లో నేల వాలిన వరి పంట

రైతు కష్టం వర్షార్పణం

అన్నదాత కష్టం నీటిపాలైంది. ఆదివారం రాత్రి, సోమవారం మధ్యాహ్నం కురిసిన వర్షాలకు ధాన్యం తడిసింది. పొలాల్లో వరిపైరు నేలవాలింది. చేలల్లో పత్తి నల్లబడి నేలరాలుతోంది. ప్రభుత్వం స్పందించి తమను ఆదుకోవాలని అన్నదాతలు కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, బృందం**

కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలి

ఎల్లారెడ్డి, న్యూస్‌టుడే : రైతులు తాము పండించిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయిస్తేనే గిట్టుబాటు ధర లభిస్తుందని ఎల్లారెడ్డి పీఏసీఎస్ ఛైర్మన్ నర్సింలు అన్నారు. సోమవారం సోమిరేగడి తండాలో వరి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో వైస్‌ఛైర్మన్ ప్రశాంత్‌గౌడ్, డైరక్టర్లు, వ్యవసాయ శాఖ అధికారులు పాల్గొన్నారు.

సమన్వయంతో గెలుపుబాట

ఎల్లారెడ్డి, న్యూస్‌టుడే : కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని ఎల్లారెడ్డి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సాయిబాబా అన్నారు. క్యాంపు కార్యాలయంలో గ్రామకమిటీ అధ్యక్షులు, కార్యకర్తలతో సమావేశం ఏర్పాటు చేశారు. సమన్వయంతో పనిచేసి రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల గెలుపునకు కృషిచేయాలన్నారు.

కాలినడకన వెళ్లి.. మరమ్మతులు చేసి..



గాంధారి, న్యూస్‌టుడే: మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం రాత్రి కురిసిన భారీ వర్షానికి ఉత్తునూర్ 33కేవీ లైనులో విద్యుత్తు సరఫరాకు అంతరాయం ఏర్పడింది. స్పందించిన అధికారులు ఎల్లారెడ్డి డీఈ విజయ సారథి ఆధ్వర్యంలో ఏడీఈ మల్లేష్, ఏఈ లక్ష్మణ్‌తో పాటు సిబ్బంది కాలినడకన సుమారు 2 కిలోమీటర్లు వెళ్లి 33కేవీ ఇన్సులేటర్ మార్చి సరఫరాను పునరుద్ధరించారు. సిబ్బందిని ఎస్‌ఈ రమేష్‌బాబు, గ్రామస్థులు అభినందించారు.

బీవీహెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడిగా రాంసింగ్



పెద్దకొడప్‌గల్, న్యూస్‌టుడే: భారత వికలాంగుల పరిరక్షణ సమితి కామారెడ్డి జిల్లా అధ్యక్షుడిగా పెద్దకొడప్‌గల్ మండలం పోచారం తండాకు చెందిన బర్దావల్ రాంసింగ్ ను ఎన్నుకున్నట్లు రాష్ట్ర అధ్యక్షులు, గిద్దె భాగ్యమ్మ ఫౌండేషన్ ఛైర్మన్ గిద్దె రాజేష్ సోమవారం ఓ ప్రకటనలో తెలియజేశారు.

రైతులు సహకరించాలి

బాన్సువాడ పట్టణం, న్యూస్‌టుడే: రహదారులపై రైతులు రెండు వైపులా ధాన్యం నిల్వ చేయడంతో ప్రజలకు, బస్సుల రాకపోకలకు ఇబ్బందులవుతున్నాయని ఆర్టీసీ డీఎం సరితాదేవి ఒక ప్రకటనలో తెలిపారు. ఒక వైపు మాత్రమే ధాన్యం నిల్వలు ఉంచి, ఎవరికీ ఇబ్బందులు లేకుండా సహకరించాలని ఆమె కోరారు.



బిచ్కుంద: ర్యాలీ నిర్వహిస్తున్న పోలీసులు



పెద్దకొడప్‌గల్‌లో..



గాంధారిలో...



ఎల్లారెడ్డిలో...



లింగంపేటలో...



కామారెడ్డి: రక్తదానం చేస్తున్న ఎస్పీ సింధుశర్మ

అమర వీరుల త్యాగాలు మరువలేనివి

పోలీసు అమరవీరుల త్యాగాలు మరువలేనివని అధికారులు పేర్కొన్నారు. సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని సోమవారం జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. విధి నిర్వహణలో వారు చూపిన తెగువను కొనియాడారు. అనంతరం స్మారక స్థూపాలు, చిత్రపటాల వద్ద నివాళులర్పించారు. పలు పాఠశాలల్లో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. జిల్లా కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎస్పీ సింధుశర్మ రక్తదానం చేశారు.



నాగిరెడ్డిపేటలో.. వ్యాస రచన పోటీలు...



తాడ్వాయిలో ...